# 16. ప్రవక్త సహచరుల స్థానం

ఇబ్నె మస్ఊద్ (రజిఅల్లాహు అన్హు) పలికారు : "ఎవరిని అనుసరించాలన్నా గతించిన వారిని అనుసరించండి. ఎందుకంటే బ్రతికి ఉన్నవాడు పరీక్షల నుండి సురక్షితంగా ఉండలేడు. వారు (గతించినవారు) మహాప్రవక్తగారి ప్రియ సహచరులు. ప్రవక్త (సఅసం) అనుయాయులలో కెల్లా మంచివారు. వారి మనసులు అందరి మనసుల కన్నా మంచివి. వారి జ్ఞానం ఇతరులందరి జ్ఞానంకన్నా లోతైనది. ఇంకా వారు తక్కువ మొహమాటస్తులు. అల్లాహ్ వారిని, తన ప్రవక్త సహచర్యం కొరకు తన ధర్మస్థాపన కొరకు ఎన్నుకున్నాడు. వారి గొప్పతనాన్ని గుర్తించండి, వారి మార్గచిహ్నాలను అనుసరించండి. సాధ్యమయినంత వరకు వారి నీతి నడవడికలను ఆదర్శంగా తీసుకోండి. ఎందుకంటే వారు సన్మార్గాన ఉండేవారు." (రివాహ్ రజీన్)

ఇవి మహాప్రవక్త (సఅసం) నోట వెలువడిన పలుకులు కావు. అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజిఅన్) తన సహచరులకు చేసిన హితవు మాత్రమే. అయితే వీటిని ఎంతో ప్రమాణబద్ధంగా భావించడం జరిగింది. (1) "ఎవరిని అనుసరించాలన్న...." అన్న వాక్యం ప్రత్యేకించి గమనించదగినది. ప్రతి ముస్లిం వాస్తవానికి దైవగ్రంథాన్ని, మహాప్రవక్త (సఅసం) సంప్రదాయాన్ని అనుసరించే ప్రయత్నంలో ఉంటాడు. దానికి సంబంధించి ఎవరి ఆదర్శమయినా ముందు ఉంటే, అది అతనికై ఎంతో సులభతరమవుతుంది. అందుకే అల్లాహ్ తన గ్రంథమయిన ఖుర్ఆన్లో సద్వర్తనులయిన తన దాసుల సుగుణాలను, లక్షణాలను విశదీకరించాడు. వారి మార్గాన్ని అనుసరించమని ఆజ్ఞాపించాడు. ఇబ్రాహీం, ఇస్హాఖ్, యాఖూబ్, నూహ్, దావూద్, సులైమాన్, అయ్యూబ్, యూసుఫ్, మూసా, హారూన్, జకరియ్యా, యహ్యా, ఈసా, ఇలియాస్, ఇస్మాయిల్, యూనుస్ మరియు లూత్ అలైహి ముస్సలాంల ప్రస్తావన వచ్చిన తరువాత ఖుర్ఆన్లో ఇలా ఆదేశించబడింది :

> **"వీరెవరంటే, అల్లాహ్ వీరికి మార్గం చూపాడు. వీరి జీవితాలనే అనుసరించండి. ఈ విషయమై నేను మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ అపేక్షించటం లేదని వారితో చెప్పివేయండి. ఇదైతే సమస్త లోకాల కోసం ఒక సర్వసామాన్య హితోపదేశం మాత్రమే." (అల్ అన్ ఆమ్ : 90)**

(2) "గతించిన వారిని అనుసరించండి" అంటే విశ్వాస స్థితిలో మరణించిన వారని భావం. ఇంకా వారెంతో సద్వర్తనులు. సతతం వారు దైవ విధేయతలో ఉండేవారు.

(3) "బ్రతికి ఉన్నవాడు పరీక్షనుండి సురక్షితంగా ఉండలేడు" అన్న వాక్యం కూడా

https://teluguislam.net

ఆలోచించదగినదే. జీవించి ఉన్నవాడిచేత ఎప్పుడైనా పెద్దపాపం జరిగిపోవచ్చు. ధర్మపరాయణుడుగా పరిగణించబడే వ్యక్తే ఒక్కోసారి అపరాధానికి ఒడిగడతాడు. విశ్వాసిగా బ్రతికేవాడు మధ్యలో ధర్మభ్రష్టుడుగా, అవిశ్వాసిగా మారిపోయే అవకాశం కూడా ఉంది. (దైవం మన్నించుగాక!) అందుకే సజీవుడైన ఏ మనిషినయినా, భావితరాలకు ఆదర్శవంతుడు అని అనటం సమంజసం కాదు. అయితే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి జీవితం, ఆయన వ్యక్తిత్వం నిస్సంశయంగా అందరికీ ఆదర్శవంతమైనది. నిజానికి ఆచరించవలసింది, అనుసరించవలసింది ఆయన నెలకొల్పిన సున్నత్ (సంప్రదాయం)నే, దివ్య ఖుర్ఆన్‌లో సెలవియ్యబడింది -

**"యథార్థానికి దైవప్రవక్తలో మీకోసం అత్యుత్తమమయిన ఆదర్శం ఉంది. అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించే, మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి వ్యక్తి కొరకు (ఆయనలో ఆదర్శం ఉంది)." (అల్ అహ్‌జాబ్ : 21)**

దివ్య ఖుర్ఆన్‌లో 20 కంటే ఎక్కువ చోట్లే అల్లాహ్ తన అంతిమ ప్రవక్తతోపాటు, ఆయన ప్రియ సహచరుల సుగుణాలను వివరించాడు - వారి జీవితాలను ఆదర్శంగా గ్రహించి మనం ఆ మేరకు అనుసరిస్తామన్నదే దీని ఉద్దేశం. సహాబాలు (ప్రవక్త సహచరులు) దోషరహితులు కారు. విమర్శకు అతీతులు కూడా కారు. అయితే వారిలో మంచి అధికంగా ఉండేది. వారిలో ఎన్ని సుగుణాలు ఉండేవంటే, అసలటువంటి సద్వర్తనుల సమూహం నాటి నుండీ నేటి వరకు ధరణిపై జన్మించనే లేదు.

(4) "ప్రవక్త (స) అనుయాయుల్లో కెల్లా మంచివారు" అనేది మరో వాక్యం. అంటే మహాప్రవక్త (సఅసం) అనుచర సమాజంలో ఎందరు మరణించారో, ఇంకా ఎందరు తరువాత మరణించనున్నారో - వారందరిలో కెల్లా ప్రవక్త ప్రత్యక్ష సహచరగణం శ్రేష్ఠమయినది. గౌరవప్రదమైనది. ఎందుకంటే, వారు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం తమ జీవితాలనే అంకితం చేసివేశారు. సర్వాస్వాన్నీ అర్పించారు.

(5) "వారి మనసులు అందరి మనసుల కన్నా మంచివి" - అంటే, వారు దైవానికి విధేయత చూపేవారు, ఆయన ఆయత్‌లను విశ్వసించేవారు, తమ సకల ఉపాసనలను ప్రదర్శనా భావం నుండి కాపాడుకునేవారు అని భావం. ఇంకా వారి హృదయాలు దైవభీతితో కంపిస్తూ ఉండేవి. దైవం పట్ల వారి హృదయాలలో అచంచల విశ్వాసం, అకుంఠిత దీక్షాభావం ఉండేవి.

(6) "వారి జ్ఞానం అందరికన్నా లోతైనది" అంటే, వారు ఏ విషయాన్నయినా క్షుణ్ణంగా పరిశీలించేవారు. దాని లోతుల్లోకి వెళ్ళిపోయే వారు. మంచీచెడుల మధ్య విచక్షణను

https://teluguislam.net

పాటించేవారు. లోక జ్ఞానంతో పాటు పరలోక సాఫల్యం గురించిన జ్ఞానం వారిలో మెండుగా ఉండేది.

(7) "వారు తక్కువ మొహమాటస్తులు" అంటే వారిలో కృత్రిమంగా హావభావాలను ప్రదర్శించే అలవాటుగాని, ముసుగులో గుద్దులాట ధోరణిగాని ఉండేవి కావు. ఏ విషయాన్నయినా సూటిగా అడిగేవారు, సూటిగానే సమాధానమిచ్చేవారు. మరోమాటలో చెప్పాలంటే వారి జీవితాలు తెరచిన పుస్తకం వంటివి. అన్నపానీయాలలోనయినా, తమలోని లోటుపాట్లను సంస్కరించుకునే ప్రయత్నంలో నయినా వారు మొహమాట పడేవారు కాదు. వారిలో దాపరికం ఉండేది కాదు.

(8) "అల్లాహ్ వారిని తన ప్రవక్త సహచర్యం కొరకు, తన ధర్మస్థాపన కొరకు ఎన్నుకున్నాడు." అల్లాహ్, అసంఖ్యాకులయిన తన దాసులలో ఏ ఒక్కరినో తన పనికోసం ప్రవక్తగా ఎన్నుకుంటాడు. అదేవిధంగా ప్రవక్త సహచర్య భాగ్యం కూడా ఏ కొందరికో గాని ప్రాప్తం కాదు. సహాబాలు కూడా దేవుని తరఫున ఎన్నుకోబడ్డారు. వారు ఇస్లాం అనే కట్టడానికి పునాదిరాళ్ళ వంటివారు. ప్రవక్త క్రమ శిక్షణలో వారు ఎలా పోతపోయబడ్డారంటే అవసరమయితే తమ ధన ప్రాణాలను, తమ సంతానాన్ని సయితం అల్లాహ్ మరియు ప్రవక్త కోసం అర్పించడానికి సిద్ధంగా ఉండేవారు. దైవధర్మాన్ని భువిపై స్థాపించే, దివ్య గ్రంథాన్ని ప్రజలకు వినిపించే ప్రయత్నంలో ఉండేవారు. దైవం వారిని ఎన్నుకున్నది కూడా అందుకే మరి.

(9) "వారి గొప్పదనాన్ని గుర్తించండి" అంటే వారిలోని మంచిని గ్రహించి, వారిని ప్రేమించటం, వారిలో ఉండే ఉత్తమ గుణగణాలను అలవరచుకోవటమని భావం.

(10) "వారు సన్మార్గాన ఉండేవారు." ఎందుకంటే వారు అల్లాహ్ మరియు మహాప్రవక్త గారి పంథాను ఖచ్చితంగా అవలంబించారు. ఖుర్ఆన్ ఉద్దేశ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నారు. దైవమార్గంలో ఎలాంటి త్యాగమయినా సంతోషంగా చేశారు. ప్రవక్త సహచర గణాన్ని, వారి గుణ గణాలను అల్లాహ్ ఎన్నో ఆయత్‌లలో వివరించాడు - అవి మనకు మార్గదర్శకం కావటానికి.

**"ముహమ్మద్ అల్లాహ్ యొక్క ప్రవక్త. ఎవరయితే ఆయనకు తోడుగా ఉన్నారో వారు కాఫిర్ల (తిరస్కారుల) యెడల కఠినులు. (అయితే) పరస్పరం ఎంతో దయార్ద్ర హృదయులు. మీరు వారిని రుకూ మరియు సజ్దాల స్థితిలో చూస్తారు. వారు అల్లాహ్ కృపను, ఆయన ప్రసన్నతను అన్వేషిస్తారు. వారి ముఖారవిందాలపై సజ్దాల చిహ్నాలు కనిపిస్తాయి." (అల్ ఫతహ్ : 29)**

https://teluguislam.net